## క్లుప్తంగా

### విజేతగా నిలిచిన జమాల్ టీం



జమాల్ టీంకు నగదుతో పాటు ట్రోఫీని అందజేస్తున్న కొండారెడ్డి

రాజుపాళెం: రాజుపాళెం మండల స్థాయిలో కొర్రపాడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. అదే గ్రామానికి చెందిన జమాల్, నాగేంద్ర జట్లు ఫైనల్ పోటీలో తలపడ్డాయి. ఇందులో విన్నర్‌గా జమాల్ జట్టు, రన్నర్‌గా నాగేంద్ర జట్టు నిలిచాయి. టోర్నమెంట్‌లో 12 టీంలు పాల్గొన్నాయి. కొర్రపాడు గ్రామానికి చెందిన కొండారెడ్డి ట్రాన్స్‌పోర్టు, స్కూల్ అధినేత వెంకట కొండారెడ్డి ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించారు. విజేత జమాల్ టీంకు రూ.20 వేలు, రెండో బహుమతి నాగేంద్ర టీంకు రూ.10 వేలు నగదుతో పాటు ట్రోఫీని కొండారెడ్డి అందజేశారు.

### ఉత్సాహంగా వార్షికోత్సవ వేడుకలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వైఎంఆర్ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాలలో ఆదివారం రాత్రి పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చదువులో రాణించిన, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్న స్థానాల్లో నిలవాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక కొట్టి హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1996–97 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా గురువులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. గురువులు చూపించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం ప్రతి విద్యార్థీ వివిధ వృత్తుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగుతూ ఆనంద జీవితాన్ని గడుపుతున్నట్లు పేర్కొన్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పి ఉన్నతంగా తీర్చిదిద్దిన గురువులను గుర్తు తెచ్చుకున్నారు.

### అభాగ్యుల కోసం ఆశ్రమం

కాశినాయన: అభాగ్యులను ఆదరించేందుకు వివేకానంద సేవాశ్రమాన్ని స్థాపించామని ఆశ్రమ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి తెలిపారు. దాతల సహకారంతో ఎకరా విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేవాశ్రమం నిర్మించామన్నారు. వృద్ధాప్యంలో కుటుంబాలకు దూరమై ఆదుకునే దిక్కు లేక ఆదరణ లేక ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులను చేరదీసి ఆశ్రయం కల్పిస్తున్నామని తెలిపారు. ఆశ్రమంలో చేర్పించాలనుకున్న, చేరాలనుకునే వారు 8897292237, 9346850854 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### రెడ్డిపల్లెలో ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలసపాడు: మండలంలోని రెడ్డిపల్లె, గంగాయపల్లె గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రతి గడపకు వెళ్లి వారికి చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సింగరయ్య, థామస్ తదితరులు పాల్గొన్నారు.

### 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

జమ్మలమడుగు: గురుకుల పాఠశాలలో 5వతరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు ఈనెల 31వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని మైలవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ప్రభావతి దేవి ఆదివారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఐదు, 6,7వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 26వతేదీన జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆమె తెలిపారు.

# సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆదరించండి

- ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపు



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులోని శ్రీకృష్ణదేవరాయనగర్, ఎస్టీకాలనీల్లో ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ తన మేనిఫెస్టోలో 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటి అమలు చేయకుండా ప్రజలను మోసగించారని, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నేడు బూటకపు హామీలతో ప్రజల వద్దకు వస్తున్నారని, వారి మోసపూరిత హామీలను ఎట్టిపరిస్థితుల్లో నమ్మవద్దని సూచించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల తలరాతలను మార్చారని గుర్తుచేశారు. విద్య, వైద్య రంగంతో పాటు మహిళా సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. పేదలందరికి పారదర్శకంగా పథకాలు అంది వారి జీవితాలు మరింత మెరుగుపడాలంటే రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలవడం ద్వారానే అది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. తొలుత ఎన్‌జీవో కాలనీలోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు పోలిరెడ్డి, యద్దారెడ్డి, వైవీయూ పాలకమండలి సభ్యులు కె.సి. సుబ్బారావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు దుద్దుకూరు సత్యం, ఓబుల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, రమేష్‌బాబు, అనిల్, నాగేశ్వర్‌రావు, మౌలాలి, షఫి, అక్బర్, రజనీకాంత్, వెంకటసుబ్బయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింగమాల వెంకటేశ్వర్లు, యాదవ సంఘం అధ్యక్షుడు బుర్రి రాజాయాదవ్, యువజన విభాగం నియోజకవర్గ నాయకులు సుధాకర్‌రెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాల లబ్ధిని వివరించండి**

కలసపాడు: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేశారని, ప్రతి ఇంటికి వెళ్లి వారికి చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బూత్ కన్వీనర్లతో «మేం సిద్ధం – మా బూత్ సిద్ధం» కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించాలన్నారు. ప్రతి బూత్ కన్వీనర్ సైనికుల్లా పనిచేసి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వైఎస్అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల అధ్యక్షుడు కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణ యాదవ్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, దేవసాని శ్రీనివాసులరెడ్డి, పులి వీరారెడ్డి, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం**



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న డీసీ గోవిందరెడ్డి, డాక్టర్ సుధ

గోపవరం: మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి ఓబుల్‌రెడ్డి నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, మల్లెంకొండేశ్వరస్వామి ఆలయ చైర్మన్ రెడ్డిపల్లి గోవిందరెడ్డి, సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మల్లెం కొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన పాలకమండలి, దేవదాయశాఖ అధికారులను అభినందించారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంలో పాలకమండలి సభ్యులు కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఆలయ అభివృద్ధికి ఇప్పటికే రూ.40 లక్షలు ఖర్చు చేశామని, మళ్లీ వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రాహ్మణపల్లె నుంచి కొండ దిగువన వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, బద్వేలు మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, సర్పంచ్‌లు కలువాయి లక్ష్మీదేవి, రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సివిల్‌సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు కలువాయి రమణారెడ్డి, సాంబశివారెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భస్మహారతి



భస్మహారతి అందుకుంటున్న అగ్రేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ఘనంగా భస్మహారతి నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామివారికి వేదపండితులు మంత్రోచ్చారణలతో సహస్రనామ భస్మార్చన, భస్మహారతి ఇచ్చారు.

**నేడు సీతారాముల కల్యాణం**

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని కాలక్షేపం మండలంలో గండ్లూరి వీరప్రతాప్‌రెడ్డి, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ సేవక్ డాక్టర్ పోలాప్రగడ శ్రీనివాస స్వామిజీచే సుందరకాండ సప్తాహ పారాయణం ఏర్పాటు చేశారు. సోమవారం ముగింపు సందర్భంగా ఉదయం 10.45 గంటలకు సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నారని, భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి కోరారు.

# ఫ్యాన్ గుర్తుకు ఓటు.. మీ భద్రతకు చోటు



ప్రచారం చేస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

పోరుమామిళ్ల: వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని, మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ కోరారు. ఆదివారం సిద్ధవరం పంచాయతీ మెయిన్ విలేజ్, హరిజనవాడల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రచారంలో రంగసముద్రం, సిద్ధవరం సర్పంచులు రవిప్రకాష్‌రెడ్డి, ముండ్లపాటి చెన్నమ్మ, ఎంపీటీసీ లక్ష్మీదేవి, పంచాయతీ నాయకులు అంబవరం రమణారెడ్డి, దళిత నాయకులతో కలిసి ప్రచారం చేశారు.

**ఇంటింటి ప్రచారం**

పోరుమామిళ్ల పట్టణంలో ఆదివారం సాయంత్రం వైఎస్ ఎంపీపీ సీఎం బాష ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని, ముఖ్యమంత్రిగా జగనన్ననే గెలిపించాలని కోరారు. జగనన్న సీఎంగా ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, అభివృద్ధి పరుగులెత్తుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మాటలకు మోసపోవద్దని సూచించారు. ప్రచారంలో ఎంపీటీసీ ఇస్సాక్, బూతు కన్వీనర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ సారథి సీఎం జగన్

- ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని సత్కరిస్తున్న చొక్కం రమేష్ తదితరులు

మైదుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాల్లా పరిగెత్తుతున్నాయని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కొనియాడారు. ఆదివారం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని లింగాలదిన్నె, కోనాయపల్లె గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. లింగాలదిన్నె గ్రామంలో రూ.10 లక్షలు, కోనాయపల్లెలో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కోనాయపల్లె, లింగాలదిన్నె గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్లను వేస్తున్నట్టు తెలిపారు. టీడీపీ హయాంలో లింగాలదిన్నెలో అభివృద్ధి పనులు చేయకుండానే టీడీపీ నేతలు లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతి మచ్చుకైనా కనిపించదని పేర్కొన్నారు. గొల్లపల్లె – లింగాలదిన్నె మార్గమధ్యలో గోడేరు వంకపై బ్రిడ్జి నిర్మించాలని గొల్లపల్లె గ్రామస్తులు ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని కోరారు. బీటీ రోడ్డుతో పాటు బ్రిడ్జి నిర్మాణం కూడా త్వరలోనే చేపడుతామని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు చొక్కం రమేష్, సంజీవయ్య, ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నేడు వైఎస్సార్ చేయూత సంబరం**

మైదుకూరు: మైదుకూరులో సోమవారం నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ చేయూత సంబరాన్ని నిర్వహించనున్నారు. స్థానిక నంద్యాల రోడ్డులోని కేఎస్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులంతా హాజరు కావాలని వైకేపీ ఏపీఎం సుజాత తెలిపారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రమేష్

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.8 లక్షల చెక్కులను ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ ఆదివారం శ్రీరాములపేటలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజల వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారని కొనియాడారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 5 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన దాదాపు రూ.8లక్షల చెక్కులను అందజేశారు.

### సిద్ధం సభకు వెళ్లిన నాయకులు



సిద్ధంకు సభకు బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలసపాడు: మేదరమెట్ల సిద్ధం సభకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివెళ్లారు. మండలంలోని ఎగువ తంబళ్లపల్లె ఎంపీటీసీ కొండా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివెళ్లారు.

# జగనన్నతోనే సంక్షేమ పాలన



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్: ముఖ్యమంత్రి జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని, ఇందుకోసం ప్రజలంతా రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులోని రఘునాథపురంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధను గెలిపించాలని కోరుతూ ఆదివారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు చెన్నకృష్ణారెడ్డి, రామ్మోహన్, రమేష్‌బాబు, సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, శ్రీను, రామచంద్ర, రఘురామిరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సోమాపురంలో వైద్య శిబిరం

చాపాడు: మండలంలోని సోమాపురం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని, ఈ అవకాశాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**పీఎంఎస్ఎంఏ వైద్య శిబిరం**

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రాజేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన గర్భవతులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

# ఏం ఆశించి బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఎమ్మెల్యే రాచమల్లు దంపతులకు దుస్తులు పెడుతున్న మహిళ

ప్రొద్దుటూరు: ఏ ప్రయోజనాలను ఆశించి చంద్రబాబు బీజేపీతో పొత్తుపెట్టుకున్నాడో రాష్ట్ర ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలనా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలనా.., వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధుల కోసమా, ప్రత్యేక ప్యాకేజీ కోసమా.. విశాఖ అభివృద్ధి కోసమా.., ఉక్కు పరిశ్రమ కోసమా.. ఏ హామీ తీసుకుని బీజేపీతో కలిశారో ప్రజలకు స్పష్టంగా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. పొత్తు కోసం బాబు వెంపర్లాట అంతా ఇంతా కాదన్నారు. మహా శివరాత్రి రోజున ఢిల్లీలో జాగరణ చేయాల్సి వచ్చిందని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. చంద్రబాబు, బీజేపీ, జనసేన కలయికను ప్రజలు విమర్శిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాయన్నారు. ఏ లాభాన్ని ఆశించి పొత్తు పెట్టుకున్నారో సమాధానం చెప్పాలని కోరారు. గతంలో ప్రధాని మోదీని విమర్శించిన వారు, సీబీఐ రాష్ట్రానికి రావద్దని విమర్శించిన వారు ఇప్పుడు ఏ రకంగా పొత్తు పెట్టుకున్నారో వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 145 సీట్లు, టీడీపీకి 30 సీట్లు వస్తాయన్నారు. సమావేశంలో రాచమల్లు రమాదేవి, మున్సిపల్ కౌన్సిలర్ ఖలీలుల్లా, ముస్లిం మైనారిటీ నాయకుడు వద్ద దాదాపీర్ పాల్గొన్నారు.

**రాచమల్లు దంపతులకు ఘన స్వాగతం**

మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో ముస్లిం నాయకుడు వద్ద దాదాపీర్, కౌన్సిలర్ వద్ద ఖలీల్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు వీరికి ఘనస్వాగతం పలికారు. పలుచోట్ల తమ ఇళ్లలోకి రాచమల్లు దంపతులను ఆహ్వానించి దుస్తులు పెట్టారు. వంద చోట్ల తమను బిడ్డ, అల్లుడుగా భావించి సంప్రదాయబద్ధంగా కొత్త బట్టలు పెట్టడం చాలా సంతోషంగా ఉందని రాచమల్లు దంపతులు తెలిపారు. మంచి చేసి ఉంటేనే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని ఎమ్మెల్యే దంపతులు ప్రజలను కోరారు. ఈ వార్డుకు సంక్షేమ పథకాల ద్వారా రూ.30 కోట్లు మంజూరైందని, రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. నియోజకవర్గం అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించానని, సంక్షేమ పథకాల ద్వారా పేదలు లబ్ధి పొందారని ఎమ్మెల్యే చెప్పారు. కూరగాయల మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్, పెన్నానదిపై బ్రిడ్జి, వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, నెహ్రూ రోడ్డు, గీతాశ్రమం వీధి, ఆర్ట్స్ కాలేజి రోడ్డు, శ్రీనివాసనగర్ రోడ్డులను విస్తరింపజేశామని, మైదుకూరు రోడ్డును స్మార్ట్ స్ట్రీట్‌గా మార్చామన్నారు. ఈ ధైర్యంతోనే అభివృద్ధి చేసి ఉంటేనే తమకు మళ్లీ ఓటు వేయాలని అడుగుతున్నామన్నారు. ప్రచారంలో ముస్లిం నాయకుడు వద్ద దాదాపీర్, కౌన్సిలర్ ఖలీల్, వార్డు నాయకులు జమాల్, ఎర్రబల్లి ఇస్మాయిల్, వెంకటరమణ, రామిరెడ్డి, నూరి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శారద, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ అక్రమ్, మార్కెట్ ఖాసీం, నన్నేసాహెబ్, హిదాయత్ పాల్గొన్నారు.

**దర్గాలో ప్రార్థనలు**

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దంపతులు షా హుస్సేన్ వల్లి దర్గాను సందర్శించారు. స్వామివారికి పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.కోటి విరాళం అందించారు.

# మానవత్వం చాటుకున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి



లారీ డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం–ఖాజీపేట మండలాల వారధిగా ఉన్న కుందూ వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బాధితులను ఆదుకుని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున వంతెన పై లారీ ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ఢీ కొన్నాయి. ఆ ఘటనలో లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి అక్కడకు చేరుకుని లారీ డ్రైవర్‌ను బయటకు తీసి 108 వాహనంలో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా క్షతగాత్రుడు ప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉపాధ్యాయ నేతలు

వైవీయూ : రాష్ట్రంలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. ఆదివారం కడప నగరం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలను, డీఏలను ప్రభుత్వం ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి.శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.గంగరాజు, జిల్లా కార్యదర్శులు కె.గంగాధర్, సురేంద్ర, దేవదత్తం తదితరులు పాల్గొన్నారు.

# మహిళా లోకానికే ఆదర్శం సావిత్రిబాయి



సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



నేనూ సావిత్రిబాయి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హేమాంజలి, వరలక్ష్మి

బద్వేలు అర్బన్: మహిళా లోకానికే సావిత్రిబాయి పూలే ఆదర్శమని మున్సిపల్ వైస్‌చైర్మన్ వై.గోపాలస్వామి, మహాత్మ జ్యోతిరావ్ పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి పేర్కొన్నారు. సావిత్రిబాయి 127వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సిద్దవటం రోడ్డులోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే అని, ప్రతి మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, బద్వేలు పౌరవేదిక చైర్మన్ పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, పూలే విగ్రహ నిర్మాణ కమిటీ వైస్‌చైర్మన్ వెంకటస్వామి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బయ్య యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణయాదవ్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జి.పుల్లయ్య, ఎం.పిచ్చయ్య, ఆవాజ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, రసూల్, బీసీ హాస్టల్ వార్డెన్ ప్రసాద్, దళిత నాయకులు మునెయ్య, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

**మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి**

ప్రొద్దుటూరు కల్చరల్: మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి కొనియాడారు. ఆదివారం స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో సావిత్రి బాయి వర్ధంతి సందర్భంగా «నేనూ .. సావిత్రిబాయిని» అనే పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హేమాంజలి మాట్లాడుతూ తాను చదవడమే కాకుండా తొలి మహిళా ఉపాధ్యాయురాలై అనేక మంది మహిళలను విద్యావంతులను చేసిన ఘనత సావిత్రిబాయిదేనని గుర్తుచేశారు. ఈ సంవత్సరం మహిళా దినోత్సవం థీమ్ ప్రకారం మహిళా పెట్టుబడితోనే సాధ్యం అవుతుందని అన్నారు. విరసం రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ రోజుకు 15 గంటల పని నుంచి అనేక పోరాటాల ద్వారా మహిళలు 8 గంటల పని విధానాన్ని, ఓటు హక్కును, పురుషులతో సమానంగా వేతనాన్ని అందుకున్నారన్నారు. ప్రతి మహిళ సమానత్వం కోసం కృషి చేయాలన్నారు. హెల్త్ అడ్వైజర్ చంద్రకళ, డాక్టర్ సమిత మాట్లాడుతూ ఆడ పిల్లల పట్ల లింగ వివక్షత చూపకూడదని, వరకట్నం ఇవ్వడాన్ని మహిళలు వ్యతిరేకించాలన్నారు. నేనూ.. సావిత్రిబాయిని పుస్తకాన్ని లాయర్ హరిత పరిచయం చేస్తూ ఈ పుస్తకాన్ని ఓల్గా అతి సరళమైన భాషలో తెలుగులోకి అనువదించారని, దీనిని జన విజ్ఞాన వేదిక తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమత కన్వీనర్ దేవమణి, జేవీవీ పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, హేమలత, మీనా, కార్తీక, సరోజ, సన, మురళిగుప్తా, తవ్వా సురేష్, మధుసూదన్ రెడ్డి, పోలంకి శ్రీరాములు, ప్రకాష్, చదువుల బాబు, కోఆర్డినేటర్స్ అభినయ్, యోచిత, అక్షయ, సాయి తదితరులు పాల్గొన్నారు.